సాక్షి

శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

శుక్రవారం ౹ 28 ౹ మార్చి ౹ 2025



సోమశిలలో 53.84 టీఎంసీలు

సోమశిల: సోమశిల జలాశయంలో గురువారం సాయంత్రానికి 53.84 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 1080 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.91,000
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,241
3 శాతం జీఎస్టీతో	రూ.8,488
సవర (8 గ్రా)	రూ.67,904

వాతావరణం

గరిష్ఠం/కనిష్ఠం 39.2 /25.5

జిల్లాలో వాతావరణం శుక్రవారం పొడిగా ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ 62 శాతంగా నమోదైంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
శుక్రవారం	శనివారం
సా: 6.22	ఉ: 4.48

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ వైఫల్యం



మాట్లాడుతున్న కృష్ణయ్య

ఆత్మకూరు రూరల్: జిల్లాలో ధాన్యం కొనుగోళ్లలో ఆర్భాటపు ప్రచారానికే పరిమితమైన ప్రభుత్వం, రైతులకు చేయూతనందించడంలో విఫలమైందని రైతు సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కృష్ణయ్య ధ్వజమెత్తారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో గురువారం నిర్వహించిన రైతు సంఘ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. జిల్లాలో ఐదు లక్షల ఎకరాలకుపైగా వరి సాగైతే, 3.57 లక్షల ఎకరాలకే ఈ – క్రాప్‌ను నమోదు చేశారని ఆరోపించారు. జిల్లాలో 300 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశామని ప్రకటించినా, చాలా చోట్ల గోతాలను సైతం ఏర్పాటు చేయకపోవడం ప్రభుత్వ వైఫల్యానికి పరాకాష్టగా అభివర్ణించారు. వాస్తవ పరిస్థితులను పరిశీలిస్తే ఇప్పటి వరకు కేవలం 50 వేల పుట్ల ధాన్యాన్నే కొనుగోలు కేంద్రాల ద్వారా సేకరించారని చెప్పారు. ప్రైవేట్ వ్యాపారులు ఎక్కువ మొత్తాన్ని ఇస్తుండటంతో, పది శాతం మంది రైతులే కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయానికి మొగ్గుచూపుతున్నారని చెప్పారు. రైతు సంఘ జిల్లా అధ్యక్షుడు శ్రీరాములు, ప్రధాన కార్యదర్శి మూలె వెంగయ్య, సహాయ కార్యదర్శులు శ్రీనివాసులు, జనార్దన్, ఉపాధ్యక్షుడు లక్కు కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సబ్సిడీ జమను పరిశీలించండి

నెల్లూరు రూరల్: దీపం – 2 స్కీమ్ కింద లబ్ధిదారులకు సబ్సిడీ మొత్తం జమైందో లేదో పరిశీలించుకోవాలని జేసీ కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పోర్టల్‌ను ఓపెన్ చేసి లబ్ధిదారుల 17 అంకెల ఎల్పీజీ గ్యాస్ ఐడీ లేదా రేషన్‌కార్డు నంబర్‌ను నమోదు చేస్తే ఓటీపీ వస్తుందని, దీన్ని ఎంటర్ చేయడం ద్వారా సబ్సిడీ స్టేటస్‌ను తెలుసుకోవచ్చన్నారు.

రేషన్‌పై ఈ – కేవైసీ కత్తి




రేషన్ డీలర్ వద్ద ఈ - పాస్ మెషీన్

సంక్షేమ పథకాలను అమలు చేయడంలో మీనమేషాలను లెక్కిస్తున్న కూటమి ప్రభుత్వం.. ఉన్న వాటిని తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తోంది. ఇప్పటివరకు రేషన్ సరుకులను పొందుతూ సుఖంగా ఉన్న బడుగులపై తాజాగా ఈ – కేవైసీ అనే అస్త్రాన్ని సంధించింది. వేలిముద్రలను వేసేందుకు కుటుంబంలోని అందరూ రావాలని హుకుం జారీ చేసింది. ప్రక్రియను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయాలనే ఆదేశాలు జారీ చేయడం వెనుక రేషన్ కార్డులకు కోత విధించాలనే దురుద్దేశం ఉందనే విషయం తేటతెల్లమవుతోంది.

వేలిముద్రలను నాలుగు రోజుల్లో సేకరించాల్సిందే

- కుటుంబంలోని అందరూ రావాలని హుకుం
- 31లోపు ప్రక్రియ పూర్తి చేయాలని ఆదేశం
- పేదలపై కూటమి ప్రభుత్వ కన్నెర్ర





చిన్నారులతో కలిసి వచ్చి వేలిముద్రలేస్తున్న మహిళ

కావలి: రేషన్‌కార్డుదారులపై ఈ – కేవైసీ పిడుగు పడింది. పేదల గుర్తింపునకు ఈ కార్డునే ప్రామాణికంగా తీసుకుంటారు. ఈ తరుణంలో ఇందులో ఉన్న కుటుంబ సభ్యులందరూ ఈ నెలాఖరులోపు వేలిముద్రలు వేసే ప్రక్రియను పూర్తి చేయాలని సర్కార్ ప్రకటించింది. ఒకవేళ ఎవరైనా చేయించుకోలేకపోతే వారికి ఇతర సంక్షేమ పథకాలు అందకుండాపోయే ప్రమాదమూ లేకపోలేదు. ఉగాదిన ప్రారంభించనున్న పీ – 4 కార్యక్రమంలో తొలి ఎత్తు ఇదేననే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

చేయించుకోలేదా.. సరుకులు బంద్

ఈ – కేవైసీని చేయించుకోకపోతే ఏప్రిల్ ఒకటి నుంచి సరుకులను పంపిణీ చేయరనే చర్చా నడుస్తోంది. సర్కార్ ఆదేశాల మేరకు ప్రభుత్వ పథకాలు పొందే ప్రతి ఒక్కరూ తమ వేలిముద్ర వేసే ఈ – కేవైసీ ప్రక్రియకు బుధవారం శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు ఇది లేకపోయినా, సరుకులు సజావుగా అందేవి. అయితే ఇక నుంచి అలా కుదరదని, ప్రతి ఒక్కరూ చేయించుకోవాల్సిందేనని అధికారులు స్పష్టం చేశారు. కార్డుతో అనుసంధానం కాని వారి జాబితాలను సిద్ధం చేసి, డీలర్లకు ఆ సమాచారాన్ని అందజేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలో దీన్ని చేయించుకోని ఐదేళ్ల నుంచి 60 ఏళ్లలోపు వారు రేషన్ షాపులకెళ్లి ఈ – పాస్ యంత్రంపై వేలిముద్ర వేసి, డీలర్ లాగిన్‌లో ఈ – కేవైసీని పూర్తి చేసుకోవాలని చెప్తున్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లోనూ అందుబాటులో ఉందని పేర్కొంటున్నారు.

క్షేత్రస్థాయిలో పర్యటనలు

ఇప్పటికే గ్రామ / వార్డు సచివాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమ పరిధిలో క్షేత్రస్థాయి పర్యటనలు చేస్తూ.. ఈ – కేవైసీ కోసం వేలిముద్రలు సేకరిస్తున్నారు. ఫలితంగా ఇతర ప్రాంతాల్లో ఉంటున్న చిరుద్యోగులు, కూలీ పనులు చేసుకునే వారు దీనికి దూరమవుతున్నారు. ఈ కసరత్తుతో రేషన్‌కార్డులకు భారీగా కోత పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఒకవేళ ప్రక్రియ జరగకపోతే సదరు రేషన్‌కార్డు రద్దు జాబితాలో చేరే అవకాశం ఉంది.

నాలుగు రోజుల్లో ఎలా సాధ్యం..?



జిల్లాలో సుమారు 20,04,581 మంది ఉండగా, వీరిలో 18,03,661 మంది ఈ–కేవైసీని నమోదు చేసుకొని ఉన్నారు. మిగిలిన 2,00,920 మంది ఇంకా చేసుకోవాల్సి ఉంది. వాస్తవానికి ప్రతి నెలా ఒకటి నుంచి 17 వరకే రేషన్ సరుకులను ఇస్తారు. ఈ తరుణంలో తమకు అనువైన తేదీలను లబ్ధిదారులు ఎంపిక చేసుకొని ఆ రోజుల్లో వీటిని పొందుతారు. నెలాఖరులో ఈ వ్యవహారాన్నే అసలు పట్టించుకోరు. ఈ క్రమంలో రానున్న నాలుగు రోజుల్లో వీరందరికీ సమాచారమిచ్చి, ప్రక్రియను జరపడం ఎంత వరకు సాధ్యమనే అనుమానం వ్యక్తమవుతోంది.

నెలాఖరుకు పూర్తి చేయాల్సిందే

జిల్లాలో రేషన్ కార్డుల లబ్ధిదారుల ఈ – కేవైసీ ప్రక్రియను ఈ నెలాఖరుకు ఎట్టి పరిస్థితుల్లో పూర్తి చేయాల్సిందే. గ్రామ, వార్డు సచివాలయాలు, రేషన్ డీలర్ల వద్దకెళ్లి చేయించుకోవాలి. దీన్ని వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశాం.

– డి.అంకయ్య, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటాం

- మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి





కాకాణితో భేటీ అయిన ప్రసన్నకుమార్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అక్రమ కేసులను ధైర్యంగా ఎదుర్కొంటామే తప్ప భయపడే ప్రసక్తే లేదని మాజీ మంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. డైకస్ రోడ్డులోని తన క్యాంప్ కార్యాలయం వద్ద విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. తన నివాసం వద్ద నాలుగు రోజులుగా రేయింబవళ్లూ తన కోసం రక్షణగా నిలిచిన పార్టీ శ్రేణులను చూస్తే గర్వంగా ఉందని చెప్పారు. కార్యకర్తలకు అన్యాయం జరిగితే సంఘటితంగా అందరూ నిలబడతామనే స్ఫూర్తి నింపిన పార్టీ జిల్లా శ్రేణులకు హ్యాట్సాఫ్ చెప్పారు. కూటమి ప్రభుత్వం ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్ని.. అక్రమ కేసులు బనాయించి జైలుకు పంపాలని చూస్తే ప్రజలు తిరగబడి రోడ్లపైకి వస్తారన్నారు. తనపై మోపిన అక్రమ కేసు విషయంలో ఇది రుజువైందని చెప్పారు. పోలీసులు రోజుకొకర్ని తీసుకొచ్చి తప్పుడు కేసులు నమోదు చేసే పనిలో నిమగ్నమై ఉన్నారని ఎద్దేవా చేశారు. పోలీస్ వ్యవస్థ పక్షపాతంగా వ్యవహరిస్తున్నా, న్యాయస్థానాల ద్వారా న్యాయం జరుగుతుందనే నమ్మకం తనకు ఉందని చెప్పారు. కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అక్రమ కేసులు బనాయిస్తామంటున్నారని, ఈ ఉడత బెదిరింపులకు భయపడేవారెవరూ లేరని చెప్పారు. తనకు అండగా నిలిచిన రాష్ట్ర, జిల్లా నేతలు, కార్యకర్తలు, సర్వేపల్లి నియోజకవర్గ ప్రజానీకానికి కృతజ్ఞతలను తెలియజేశారు.

కాకాణితో ప్రసన్న భేటీ

కాకాణి గోవర్ధన్‌రెడ్డితో మాజీ మంత్రి నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, డీసీఎమ్మెస్ మాజీ చైర్మన్ వీరి చలపతిరావు తదితరులు భేటీ అయ్యారు.

భారీగా మోహరించిన కార్యకర్తలు

కాకాణి గోవర్ధన్‌రెడ్డిని అరెస్ట్ చేస్తారనే ప్రచారంతో ఆయన ఇంటి వద్ద నేతలు, కార్యకర్తలను గురువారం రాత్రి భారీగా మోహరించారు. అక్రమ కేసులో తమ నాయకుడ్ని అరెస్ట్ చేస్తే ఊరుకునేదిలేదని నినాదాలు చేశారు. అర్ధరాత్రి అరెస్ట్ చేస్తారనే సంకేతాలతో డైకస్ రోడ్డు ప్రాంతంలో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పొద్దుపోయాక కాకాణి నివాసానికి ఆయా గ్రామాల నుంచి కార్యకర్తలు చేరుకుంటున్నారు.

తల్లీబిడ్డలపై మమకారం చూపాలి



మాట్లాడుతున్న ఆనంద్, పక్కన సూర్యకుమారి

నెల్లూరు రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల్లో సేవలు పొందుతున్న తల్లీబిడ్డలపై మమకారం, వాత్సల్యం చూపాలని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి పేర్కొన్నారు. మహిళా శిశు సంక్షేమ శాఖపై కలెక్టర్ ఆనంద్‌తో కలిసి కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం, టాయ్‌లెట్ల నిర్వహణలో పురోగతి చూపాలని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం గుర్తించిన సుపోషిత్ పంచాయతీల్లో నిబంధనలకు అనుగుణంగా అన్ని సదుపాయాలను కల్పిస్తే వాటికి గుర్తింపుతో పాటు రూ.లక్ష పారితోషికం లభించనుందని చెప్పారు. గర్భిణులకు నిర్దేశించిన పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా అందించాలని ఆదేశించారు. పాఠశాల డ్రాపౌట్స్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. కనీసం పదో తరగతి పూర్తిచేసేలా అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. గృహ హింస చట్టాన్ని పక్కాగా అమలు చేయాలన్నారు.

ఆత్మసంతృప్తితో పనిచేయండి

అంగన్‌వాడీ కార్యకర్తలు ఆత్మ సంతృప్తితో పని చేయాలని కలెక్టర్ ఆనంద్ కోరారు. పిల్లల ఎత్తు, బరువును ఎప్పటికప్పుడు నమోదు చేయాలన్నారు. ఉదయగిరి కళాకారులతో ప్రత్యేకంగా తయారు చేయించిన చెక్క ఆట వస్తువులను ప్రిన్సిపల్ సెక్రటరీ సూర్యకుమారి తిలకించారు. రాష్ట్రంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేసేలా చూడాలని కలెక్టర్ కోరారు. అనంతరం బాలల న్యాయచట్టం పోస్టర్లను ఆవిష్కరించారు. కందుకూరు సబ్ కలెక్టర్ శ్రీపూజ, ఐసీడీఎస్ ఆర్జేడీ జయలక్ష్మి, పీడీ నిర్మలాదేవి, డీఆర్వో ఉదయ భాస్కర్‌రావు, ఆర్డీఓలు అనూష, పావని, వంశీకృష్ణ, డీఎస్పీ సింధుప్రియ, హౌసింగ్ పీడీ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో రూ.1.41 కోట్ల దుర్వినియోగం

నెల్లూరు (పొగతోట): రాపూరు మండలంలో సంఘబంధం, పొదుపు సంఘాల సభ్యులకు తెలియకుండా రూ.1.41 కోట్లను దుర్వినియోగం చేశారని డీఆర్డీఏ పీడీ నాగరాజకుమారి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వీటిలో రూ.57 లక్షలను రికవరీ కింద జమ చేశామన్నారు. రూ.84 లక్షలను రికవరీ చేయాల్సి ఉందని చెప్పారు. దీనికి సంబంధించి ఏడుగురు సిబ్బందిపై చర్యలకు నిర్దేశించామని, విచారణ అనంతరం తదుపరి చర్యలు చేపడతామని తెలిపారు.

ధనాన్ని వెదజల్లి ఎంపీపీ స్థానాన్ని దక్కించుకున్న టీడీపీ

- నాడు తిరస్కరణకు గురై.. సున్నాకే పరిమితం
- ఓట్లేసిన ప్రజలను వంచించిన ఎంపీటీసీలు

విడవలూరు: మూడున్నరేళ్ల క్రితం నిర్వహించిన ఎంపీటీసీ ఎన్నికల్లో ఒక్క స్థానాన్నీ దక్కించుకోలేక టీడీపీ చతికిలపడింది. ప్రజాతీర్పుతో కళ్లుబైర్లు కమ్మి.. తమ స్థానమేమిటో తెలుసుకున్న ఆ పార్టీ నేడు అధికార బలంతో విర్రవీగి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలుపొందిన ఏడుగురు ఎంపీటీసీలను ప్రలోభాలకు గురిచేసి.. అభివృద్ధిని చూసి తమ వెంట వచ్చారంటూ ఊదరగొట్టి ఎంపీపీ స్థానాన్ని దక్కించుకుంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఈ ఎన్నిక వింత రాజకీయాలకు వేదికై ంది. ఈ పరిణామాలను చూసి ప్రజలు నివ్వెరబోయారు.

ప్రలోభాల ఎర.. విలువలకు పాతర

గత స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓటర్ల తిరస్కరణకు గురై పెద్ద సున్నాకే పరిమితమైన టీడీపీ.. ప్రస్తుతం అధికార మదంతో విలువలకు పాతరేసి.. ప్రలోభాలను ఎరవేసి ఎంపీపీ స్థానాన్ని దక్కించుకుంది. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించిన ఎన్నికల్లో ఇలా ఎంపీపీ పదవిని దక్కించుకొని ప్రజా తీర్పును అపహాస్యం చేసింది. ఎంపీటీసీలు వారి స్వలాభం కోసం.. అందలమెక్కించిన తమను నిలువునా మోసం చేశారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోంది.





నూతన ఎంపీపీకి అభినందన

నాడిలా..

2021లో నిర్వహించిన స్థానిక సంస్థల ఎన్నికల్లో మండలంలోని 14 ఎంపీటీసీ స్థానాలకు గానూ 12 స్థానాలను వైఎస్సార్సీపీ, మిగిలిన రెండింటిని సీపీఎం దక్కించుకున్నాయి. విడవలూరుకు చెందిన వేణుంబాక భవానమ్మను ఎంపీపీగా ఎన్నుకున్నారు. అయితే ఈ ఏడాది జనవరి 29న అనారోగ్యంతో ఆమె మృతి చెందారు. తదనంతరం అదే పార్టీ మద్దతుదారైన ముదివర్తికి చెందిన కాయల సౌందర్య ఇన్‌చార్జి ఎంపీపీగా వ్యవహరిస్తూ వచ్చారు.

పచ్చ కండువాలు కప్పి..

గతేడాది నిర్వహించిన శాసనసభ ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి చెందిన కొందరు నేతలు టీడీపీ పంచన చేశారు. వీరితో పాటు ఇద్దరు ఎంపీటీసీలూ పచ్చ కండువా కప్పుకొన్నారు. మారిన రాజకీయ పరిణామాలతో ఊటుకూరుకు చెందిన ఏకుల శేషమ్మను తమ అభ్యర్థిగా ప్రకటించారు. దీనికి వైఎస్సార్సీపీ మద్దతుదారులు, ఇద్దరు సీపీఎం ఎంపీటీసీల మద్దతూ లభించింది. దీంతో వీరు చూపు మిగిలిన వైఎస్సార్సీపీ ఎంపీటీసీలపై పడింది. వీరిని అనేక రకాలుగా ప్రలోభాలకు గురిచేశారు.

రాత్రికి రాత్రే..

ఈ క్రమంలో బుధవారం రాత్రికి రాత్రే మండలంలోని ఐదుగురు ఎంపీటీసీల ఇళ్ల వద్దకు కార్లు రావడం.. ఫోన్లు స్విచ్ఛాఫ్ అయిపోవడం వెనువెంటనే జరిగిపోయాయి. మరోవైపు ఎంపీపీ పదవి టీడీపీ కైవసం అనే మెసేజ్‌ను విడవలూరు మండలాధికారులు అనే వాట్సాప్ గ్రూపులో టీడీపీ జెడ్పీటీసీ అభ్యర్థిగా పోటీ చేసిన బాలకృష్ణ అనే వ్యక్తి పోస్ట్ చేయడం చర్చకు దారితీసింది.

అదృశ్యమై.. ఎన్నికకు ముందు ప్రత్యక్షం

కనిపించకుండా పోయిన ఎంపీటీసీలు, మరికొందరు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దకు టీడీపీ నేతలతో కలిసి చేరుకున్నారు. అక్కడి నుంచి ర్యాలీగా ఎంపీడీఓ కార్యాలయం వద్దకు చేరుకొని, ఏకుల శేషమ్మను ఎంపీపీగా ఎన్నుకున్నారు. దీంతో కోరం పూర్తయిందని అధికారులు వెల్లడించారు. పీఆర్ డీఈఈ మోహన్‌రావు, జెడ్పీ సీఈఓ విద్యారమ, ఎంపీడీఓ నగేష్‌కుమారి, తహసీల్దార్ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విలువలకు కట్టుబడిన నలుగురు

టీడీపీ నేతలు ఎన్ని ప్రలోభాలకు గురిచేసినా, నలుగురు ఎంపీటీసీలు లొంగలేదు. తమకు అవకాశమిచ్చిన వైఎస్సార్సీపీకి.. నమ్మి గెలిపించిన ప్రజలకు ద్రోహం చేయకుండా విలువలకు కట్టుబడి పలువురి ప్రశంసలను అందుకున్నారు.

దగదర్తి వైస్ ఎంపీపీ ఎన్నిక నేటికి వాయిదా



ఎంపీటీసీలు గైర్హాజరవడంతో ఖాళీగా కుర్చీలు

కావలి: దగదర్తి వైస్ ఎంపీపీ పదవికి గురువారం నిర్వహించాల్సిన ఎన్నిక శుక్రవారానికి వాయిదా పడింది. మండలంలో 11 మంది ఎంపీటీసీలు ఉండగా, వీరిలో శ్రీరామపురం ఎంపీటీసీ సభ్యురాలు పీతల కామేశ్వరమ్మ వైస్ ఎంపీపీగా ఉండేవారు. మండలంలోని చెన్నూరు సచివాలయంలో విలేజ్ వెటర్నరీ అసిస్టెంట్‌గా ఉద్యోగం రావడంతో తన పదవులకు ఆమె రాజీనామా చేశారు. మండలంలో ప్రస్తుతం పది మంది ఎంపీటీసీలకు గానూ ఎంపీపీ, ఒక వైస్ ఎంపీపీ ఉన్నారు. ఖాళీ అయిన రెండో వైస్ ఎంపీపీని మిగిలిన ఎనిమిది మంది ఎన్నుకోవాల్సి ఉంది. ఈ తరుణంలో ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఎన్నికను నిర్వహించేందుకు రంగం సిద్ధం చేశారు. దీనికి ఎన్నికల అధికారులుగా పంచాయతీరాజ్, నెల్లూరు ఈఈ సుబ్బరాజు, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఉదయం 11 గంటలు దాటినా ఎంపీటీసీలెవరూ హాజరుకాలేదు. మరో గంటను అదనంగా కేటాయించినా, ఇదే పరిస్థితి ఏర్పడింది. దీంతో కోరం లేకపోవడంతో ఎన్నికను శుక్రవారానికి వాయిదా వేస్తున్నామని ప్రకటించారు. కావలి రూరల్ సీఐ పాపారావు ఆధ్వర్యంలో దగదర్తి ఎస్సై జంపానికుమార్ తదితరులు బందోబస్తు చర్యలు చేపట్టారు.

ఏకపక్షంగా..

పొదలకూరు: మండలంలోని తాటిపర్తి పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక ప్రశాంతంగా జరిగింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతు వార్డు సభ్యులు పాల్గొనకపోవడంతో ప్రక్రియను ఏకపక్షంగా పూర్తి చేశారు. తాటిపర్తి సమస్యాత్మక గ్రామం కావడంతో నెల్లూరు రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 144 సెక్షన్‌ను విధించారు. పంచాయతీ మూడో వార్డు సభ్యురాలు కర్పూరం పెంచలలక్ష్మమ్మ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వాస్తవానికి ఇక్కడ మొత్తం 14 వార్డులుండగా, టీడీపీ మద్దతుదారులు ఐదుగురున్నారు. ఇటీవల టీడీపీ శిబిరంలో ముగ్గురు చేరడంతో వారి బలం పెరిగింది. దీంతో పెంచలలక్ష్మమ్మ ఎన్నిక ఏకగ్రీవమైంది. బందోబస్తును పొదలకూరు సీఐ శివరామకృష్ణారెడ్డి, ఎస్సై హనీఫ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ఎన్నిక ప్రక్రియను పంచాయతీ ఇన్‌చార్జి సెక్రటరీ సురేష్ నిర్వహించారు.

క్లుప్తంగా

జిల్లా జైల్లో న్యాయ విజ్ఞాన సదస్సు



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వాణి

వెంకటాచలం: మండలంలోని చెముడుగుంట సమీపంలో ఉన్న జిల్లా జైల్లో గురువారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.వాణి విచ్చేసి ఖైదీల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. భోజన వసతి, వైద్య సదుపాయాల గురించి ఆరాతీశారు. లాయర్ లేనివారికి ఉచితంగా ఆ సౌకర్యం ఏర్పాటు చేస్తామన్నారు. జిల్లా జైల్లో పారా లీగల్ వలంటీర్‌ను నియమించడం జరిగిందని, వారి ద్వారా సమస్యలపై అర్జీలు సమర్పిస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘మీరు దగ్గరుంటే ఈత రాదు’

- కుమార్తెకు స్విమ్మింగ్ నేర్పించేందుకు తీసుకెళ్లిన తల్లిదండ్రులు
- వారిని పంపించేసిన నిర్వాహకులు
- స్విమ్మింగ్‌పూల్లో బాలిక మృతి
- ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఘటన

నెల్లూరు(క్రైమ్): స్విమ్మింగ్‌పూల్ నిర్వహణలో సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతో ఈత నేర్చుకుంటుండగా ప్రమాదవశాత్తు బాలిక మృతిచెందిన ఘటన నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో గురువారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు జీవీఆర్ఆర్ కళాశాల సమీపంలోని సప్తగిరి లేఅవుట్‌లో వంశీకృష్ణ, ఆదిలక్ష్మి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి కుమార్తె, కుమారుడున్నారు. కుమార్తె మనస్వి (9) వెంకటాచలంలోని ఓ స్కూల్లో నాలుగో తరగతి చదువుతోంది. బాలికకు ఈత నేర్పించేందుకు తల్లిదండ్రులు బుధవారం స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఫీజు చెల్లించారు. గురువారం సాయంత్రం మనస్విని స్విమ్మింగ్‌పూల్ వద్దకు తీసుకెళ్లారు. మీరు దగ్గరుంటే నేర్చుకోలేరని సిబ్బంది తల్లిదండ్రులను పంపివేశారు. ఈ క్రమంలో స్విమ్మింగ్‌పూల్లో ఏమైందో తెలియదు గానీ సాయంత్రం 6.30 గంటలకు సిబ్బంది మనస్వి తల్లిదండ్రులకు ఫోన్ చేశారు. ఈత నేర్చుకుంటుండగా బాలికకు ఫిట్స్ వచ్చాయని, శ్వాస తీసుకోలేకపోవడంతో బొల్లినేని ఆస్పత్రికి తీసుకెళుతున్నామని చెప్పారు. వంశీకృష్ణ, ఆదిలక్ష్మి వెంటనే ఆస్పత్రికి వెళ్లేసరికి కుమార్తె మృతి చెంది ఉంది. సిబ్బంది నిర్లక్ష్యం, పూల్ వద్ద సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడం వల్లే తమ కుమార్తె మృతిచెందిందని తల్లిదండ్రులు ఆరోపించారు. ఈ మేరకు వారు దర్గామిట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్ర కమిటీల్లో జిల్లా నేతలకు చోటు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన నేతలకు రాష్ట్ర అనుబంధ విభాగాల్లో చోటు దక్కింది. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. రైతు విభాగం అఫిషియల్ స్పోక్స్‌పర్సన్‌గా బట్టేపాటి నరేంద్రరెడ్డి, సెక్రటరీగా దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీలుగా కర్తం శ్రీనివాసులురెడ్డి, కర్తం సురేంద్రరెడ్డి, ఎస్సీ సెల్ సెక్రటరీగా కొండా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా స్వర్ణా వెంకయ్య, కుందుర్తి శ్రీనివాసులు, బద్దేపూడి రవీంద్ర, మందా రవికుమార్, వలంటీర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా కుంచాల సవీంద్రరెడ్డి, సెక్రటరీగా పీర్ల పార్థసారథి, జాయింట్ సెక్రటరీగా ఈపూరు రజనీకాంత్‌రెడ్డి, బూత్ కమిటీల వింగ్ జనరల్ సెక్రటరీగా యనమాల భగవాన్, జాయింట్ సెక్రటరీలుగా ఎ.రాజశేఖరరెడ్డి, గణేషం గంగిరెడ్డి, మొలకల శ్రీనివాసులురెడ్డి, సోషల్ మీడియా వింగ్ సెక్రటరీగా మహ్మద్ రవూఫ్, వీవర్స్ వింగ్ జనరల్ సెక్రటరీగా కోనం బ్రహ్మయ్య, జాయింట్ సెక్రటరీగా చేబ్రోలు జనార్దన్‌లు నియమితులయ్యారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

సోమశిల: అనంతసాగరం మండలం చిలకలమర్రి సమీపంలో పాతాళపల్లి వద్ద జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ యువకుడు మృతిచెందిన ఘటన గురువారం జరిగింది. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. అనంతసాగరానికి చెందిన షేక్ ఇబ్రహీం కుమారుడు షేక్ హమీద్ (29) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. గురువారం పని నిమిత్తం అనంతసాగరం నుంచి గోవిందపల్లికి బైక్‌పై వెళ్తున్నాడు. యాకర్లపాడు నుంచి యోహాన్ అనే వ్యక్తి కలువాయికి బైక్‌పై వెళ్తున్నాడు. పాతాళపల్లి వద్ద రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తలకు గాయమై హమీద్ అక్కడికక్కడే మృతిచెందాడు. యోహాన్ గాయపడగా ఆత్మకూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఘటనా స్థలాన్ని సోమశిల పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

నెల్లూరు రూరల్: జిల్లాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు 52 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లుగా జేసీ కె.కార్తీక్ తెలిపారు. గురువారం 3,088 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు ప్రకటన విడుదల చేశారు.

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.75 సన్నవి : రూ.60

పండ్లు : రూ.35

వన్యప్రాణుల గొంతెండుతోంది



వేసవి తాపం పెరిగిపోయింది. గతేడాది కంటే ఈసారి ఉష్ణోగ్రతలు అధికంగా ఉంటాయని వాతావరణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. మండుతున్న ఎండలతో వన్యప్రాణులు జీవన్మరణ పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అడవిలో సహజ సిద్ధంగా ఉండే కుంటల్లో నీటి నిల్వలు లేక దాహార్తి తీర్చుకునేందుకు ప్రాణులు గ్రామాల వైపు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. వేసవి దృష్ట్యా అటవీ శాఖాధికారులు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

- అడవుల్లో అడుగంటిన నీటి నిల్వలు
- దాహార్తితో గ్రామాల్లోకి వన్యప్రాణులు
- మృత్యువాత పడుతున్న వైనం
- రాబోయే రోజుల్లో సమస్య మరింత జటిలం
- ప్రత్యామ్నాయంపై దృష్టి అవసరం



ఉదయగిరి ఫారెస్ట్



ఉదయగిరిలో కుక్కల దాడిలో మృతిచెందిన జింక (ఫైల్)



అటవీ ప్రాంతంలో నీటి కుంట

ఉదయగిరి: జిల్లాలో ఉన్న రిజర్వ్ ఫారెస్ట్ వన్యప్రాణులకు నిలయం. ముఖ్యంగా పెంచలకోన, ఆత్మకూరు, ఉదయగిరి అటవీ ప్రాంతాల్లో అరుదైన జంతు, వృక్ష సంపద ఉంది. ఈ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణకు అటవీ శాఖ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. వేసవిలో దాహార్తి తీర్చేందుకు అటవీ ప్రాంతంలో ఉండే మడుగులు, చలమల్లో నీటి నిల్వలు అడుగంటాయి. దీంతో వన్యప్రాణులు నీటి కోసం జనావాసాల వైపు పరుగులు తీస్తున్నాయి. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోతున్నాయి. తాగునీటి వనరులను అందుబాటులో ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

అటవీ ప్రాంతం ఇలా..

నెల్లూరు, తిరుపతి, వైఎస్సార్ కడప, ప్రకాశం జిల్లాల సరిహద్దులు ఆనుకుని సుమారు 5.40 లక్షల ఎకరాల్లో అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. పెంచలకోన అటవీ ప్రాంతానికి అనుసంధానంగా ఉన్న ఆత్మకూరు, ఉదయగిరి అటవీ రేంజ్ పరిధిలో పులులు, చిరుతలు, జింకలు, దుప్పులు, నెమళ్లు, కుందేలున్నాయి. ఎలుగుబంట్లు, తోడేళ్లు, నక్కలు, ఉడుములు, కణుతులు కూడా ఉన్నాయి.

వేసవిలో ఇబ్బందులు

వేసవి వచ్చిందంటే అటవీ ప్రాంతంలో ఉండే జలాలు పూర్తిగా ఎండిపోతాయి. దీంతో ప్రాణులు నీటి కోసం అటవీ ప్రాంతం వదలి మైదానాల వైపు పరుగులు తీస్తాయి. ఈ క్రమంలో నెల్లూరు – బద్వేలు, కావలి – సీతారామపురం, ఉదయగిరి – నందవరం తదితర రహదారులు, గ్రామాల వైపు వెళ్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని వేటగాళ్ల బారిన పడుతున్నాయి. కొంతమంది నాటు తుపాకులు, నాటు బాంబులు, పేలుడు పదార్థాలు ఉపయోగించి మట్టుబెడుతున్నారు. మరికొన్ని రోడ్డు ప్రమాదాల బారిన పడి మృత్యువాత పడుతున్నాయి.

ప్రత్యేక చర్యలు అవసరం

వేసవి కాలం ప్రారంభమై ఎండలు తీవ్రంగా ఉన్నాయి. ఉష్ణోగ్రతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మనుషులే ఇబ్బంది పడుతున్న నేపథ్యంలో వన్యప్రాణుల పరిస్థితి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. నీటి కోసం వన్యప్రాణులు అటవీ ప్రాంతం వదిలి రాకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. ఏప్రిల్, మే నెలల్లో ఎండలు, వడగాల్పుల తీవ్రత గతంలో కంటే ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అధికారులు ఏర్పాట్లపై దృష్టి సారించాలి. నిధులు సక్రమంగా ఖర్చు చేసి కుంటల్లో నీరు నిల్వ చేయాలి. ట్యాంకర్లతో తొట్టెల్లో నీరు నింపాలి. అవసరమైతే నీటి కుంటలు మరికొన్ని ఏర్పాటు చేయాలి. సహజ సిద్ధంగా ఉన్న కుంటల్లో నీరుండేలా చర్యలు చేపట్టాలి. దీంతో పులులు, జింకలు, చిరుతలు, దుప్పులు తదితర వన్యప్రాణులు అక్కడికి వచ్చి నీరు తాగుతాయి. గ్రామాలవైపు వచ్చే అవసరం ఉండదు.

సంరక్షణకు..

అడవులు, వన్యప్రాణుల సంరక్షణ కోసం అటవీ ప్రాంతం ఆనుకుని ఉన్న గ్రామాల్లో ఆ శాఖ అధికారులు కార్యక్రమాలు చేపడుతున్నారు. ముఖ్యంగా వేసవిలో అడవుల్లో అగ్నిప్రమాదాలు ఎక్కువగా జరుగుతుంటాయి. ఇటీవల ఉదయగిరి ప్రాంతంలో అడవుల్లో అగ్నిప్రమాదాలు జరిగిన ఘటనలున్నాయి. దీని నివారణకు కళాజాతా బృందాలతో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

నీటిని నింపుతున్నాం

పెంచల నరసింహ వైల్డ్ లైఫ్ ప్రాంతంలో వన్యప్రాణులకు నీటి వసతి కల్పిస్తున్నాం. 400 తొట్టెల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నాం. వన్యప్రాణులు గ్రామాల్లోకి రాకుండా చర్యలు తీసుకుంటున్నాం. మిగతా రేంజ్ పరిధిలో నీటి తొట్టెల్లేవు. ఆ ప్రాంతంలో వాననీరు కుంటల్లో నిల్వ ఉండేలా ప్రయత్నం చేశాం. అటవీ ప్రాంతంలో ఉండే జంతువులు, అరుదైన వృక్ష సంపదను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉంది. అటవీ ప్రాంతంలో గడ్డికి నిప్పు అంటించడం నేరం. అలాంటి వారిపై చర్యలు తీసుకుంటాం. – మహబూబ్‌బాషా, జిల్లా అటవీ శాఖాధికారి

చాపకింద నీరులా క్రికెట్ బెట్టింగ్



డీఎస్పీ సింధుప్రియకు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

- చర్యలు తీసుకోవాలి
- డీఎస్పీకి వైఎస్సార్‌సీపీ యువజన, విద్యార్థి విభాగాల వినతి

నెల్లూరు(క్రైమ్): ‘ఐపీఎల్ ప్రారంభం కావడంతో జిల్లాలో బెట్టింగ్ మాఫియా చాపకింద నీరులా విస్తరిస్తోంది. ఈ విష వలయంలో చిక్కుకుని యువత జీవితాలను నాశనం చేసుకుంటోంది. బెట్టింగ్ మాఫియాపై చర్యలు తీసుకోవాలి’ అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు ఊటుకూరు నాగార్జున పోలీస్ ఉన్నతాధికారులను కోరారు. గురువారం యువజన, విద్యార్థి విభాగాల నేతలు నగర డీఎస్పీ పి.సింధుప్రియను నెల్లూరులోని కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాగార్జున మాట్లాడుతూ బెట్టింగ్ కారణంగా అనేకమంది అప్పుల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు చేసుకునేందుకు వెనుకాడటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బెట్టింగ్ మాఫియాను కట్టడి చేసేందుకు రాజకీయాలకు అతీతంగా అందరూ కలిసి రావాలని కోరారు. పోలీస్ అధికారులు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసి మాఫియా, బెట్టింగ్ యాప్‌లు, వాట్సాప్ గ్రూప్‌లపై నిఘా పెంచాలన్నారు. నష్టాలను తెలియజేసేలా అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు ముంగమూరు ఆశ్రిత్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు నగరంలో లాడ్జీలు, హోటల్స్, గెస్ట్‌ఇన్‌లలో బెట్టింగ్ జోరుగా సాగుతోందన్నారు. సులభంగా నగదు సంపాదించవచ్చని నిర్వాహకులు యువత, విద్యార్థులకు ఆశచూపి బెట్టింగ్ ఊబిలో దించుతున్నారన్నారు. బానిసైన అనేకమంది బయటకు రాలేక నష్టాలను భర్తీ చేసుకోవడానికి, అప్పులు తీర్చుకునేందుకు నేరాలకు పాల్పడుతూ భవిష్యత్‌ను అంధకారం చేసుకుంటున్నారన్నారు. స్పందించిన డీఎస్పీ క్రికెట్ బెట్టింగ్‌ను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. ఎక్కడైనా బెట్టింగ్ జరుగుతున్నట్లు గుర్తిస్తే డయల్ 112, 100 లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందిస్తే తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

లైంగికదాడికి యత్నం కేసులో ఐదేళ్ల జైలు

నెల్లూరు(లీగల్): బాలికపై లైంగికదాడికి ప్రయత్నించాడని నమోదైన కేసులో నేరం రుజువు కావడంతో నాయుడుపేట శ్రీరామ్‌నగర్ ప్రాంతానికి చెందిన కార్యం అంకయ్య అనే వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ.22,000 జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి సిరిపిరెడ్డి సుమ గురువారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు.. 2019 ఏప్రిల్ 28వ తేదీన ఆడుకుంటున్న 9 సంవత్సరాల బాలికకు అంకయ్య స్వీట్లు ఇస్తానని ఆశ చూపి తన ఇంట్లోకి తీసుకెళ్లి లైంగికదాడికి యత్నించాడు. బాలిక ఏడుపు విన్న పొరుగింటి వాళ్లు విషయం తెలుసుకుని కేకలు వేయగా నిందితుడు పారిపోయాడు. బాలిక ఈ విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలిపింది. ఈ ఘటనపై బాలిక తండ్రి ఫిర్యాదు మేరకు నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు అనంతరం నిందితుడిపై కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అంకయ్యపై నేరం రుజువు కావడంతో పైమేరకు శిక్ష జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రత్యేక పీపీ చంద్రశేఖర్ వాదించారు.

పెళ్లి చేసుకుని మోసం చేశాడు



మన్సూర్ ఇంటి వద్ద లక్ష్మి



లక్ష్మి, మన్సూర్‌ల వివాహ సమయంలో తీసిన ఫొటో

- భర్త ఇంటి ముందు భార్య ఆందోళన

సంగం: వారిద్దరూ ప్రేమించుకుంటున్నారు. సహజీవనం చేశారు. వివాహం చేసుకున్నారు. అయితే భార్యను వదిలేసి భర్త స్వగ్రామానికి వచ్చాడు. దీంతో మోసపోయానని గ్రహించిన గిరిజన యువతి సంగంలో భర్త ఇంటి వద్ద గురువారం ఆందోళన చేసింది. బాధిత యువతి స్థానిక పోలీసులకు తెలిపిన వివరాల మేరకు వివరాలిలా ఉన్నాయి.. బుచ్చిరెడ్డిపాళెం మండలం దామరమడుగుకు చెందిన గిరిజన యువతి లక్ష్మి, సంగంలోని మసీదు సెంటర్‌కు చెందిన షేక్ మన్సూర్ ఆరు సంవత్సరాలుగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. వేర్వేరు చోట్ల పనిచేస్తున్న వీరు ప్రేమించుకున్నారు. సహజీవనం చేశారు. లక్ష్మి ఒత్తిడితో నెలరోజుల క్రితం హైదరాబాద్‌లోని ఓ దేవాలయంలో వివాహం చేసుకున్నారు. ఈ విషయం తెలుసుకున్న మన్సూర్ తల్లిదండ్రులు, అన్న ఒత్తిడి చేయడంతో అతను సంగం వచ్చేశాడు. మరో మహిళతో వివాహానికి సిద్ధమయ్యాడని తెలుసుకున్న లక్ష్మి బుధవారం హైదరాబాద్ నుంచి సంగం వచ్చింది. మన్సూర్ లేకపోవడం.. అతని తల్లిదండ్రులు సరైన సమాధానం చెప్పకపోవడంతో వారి ఇంటి ముందు బైఠాయించింది. తనకు, మన్సూర్‌కు వివాహమైనట్లుగా ఫొటోలు చూపించి కన్నీటిపర్యంతమవుతోంది. గతంలో ఈ విషయమై సంగం, హైదరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశానని లక్ష్మి చెబుతోంది. అప్పుడు హైదరాబాద్‌లో మన్సూర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఎలాంటి సమస్య లేకుండా చూసుకుంటానని చెప్పి మోసం చేయడంతో సంగం వచ్చానని లక్ష్మి వెల్లడించింది. అతని తల్లిదండ్రులను అభ్యర్థించినా పట్టించుకోవడం లేదని కన్నీరుమున్నీరైంది.

మన్సూర్ తల్లిదండ్రులతో మాట్లాడుతున్నాం

ఈ విషయమై ఎస్సై రాజేష్ స్పందిస్తూ మన్సూర్ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. భార్యాభర్తలను కలపాలని సూచించామన్నారు. లక్ష్మిని ఆమె బంధువులకు అప్పగించినట్లు చెప్పారు. ఈ విషయమై మన్సూర్ తల్లిదండ్రులను విలేకరులు ప్రశ్నించగా వారు సమాధానం చెప్పేందుకు నిరాకరించారు.

సినీ హీరోనంటూ పరిచయం చేసుకుని..

- మహిళను మోసం చేసిన వ్యక్తి
- కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఇన్‌స్టాగ్రామ్‌లో సినీ హీరోనంటూ పరిచయమై మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసగించిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. తిరుపతి జిల్లా కోట మండలానికి చెందిన ఓ మహిళ భర్త నుంచి విడిపోయింది. ప్రస్తుతం ఆమె నెల్లూరులోని ఓ హాస్పిటల్లో పనిచేస్తూ కేవీఆర్ పెట్రోల్ బంక్ సమీపంలోని లేడీస్ హాస్టల్లో ఉంటోంది. ఈ క్రమంలో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో సునీల్‌రెడ్డి అనే వ్యక్తి పరిచయమయ్యాడు. సినీ హీరోనని ఆమెతో మాటలు కలిపాడు. పెళ్లి చేసుకుంటానని ఆమెను నమ్మించి ఈ ఏడాది జనవరి ఒకటో తేదీన మద్రాస్ బస్టాండ్ సమీపంలోని ఓ హోటల్‌కు తీసుకెళ్లి లోబర్చుకున్నాడు. గతనెల 18వ తేదీన మరోమారు ఆమెను హోటల్‌కు తీసుకెళ్లాడు. పెళ్లి చేసుకోమని మహిళ కోరగా వాయిదా వేస్తూ వచ్చాడు. సినిమా సగంలో ఆగిపోయిందని, ఊర్లో ఉన్న ఆస్తిని బ్యాంక్‌లో పెట్టి నగదు తీసుకురావాలని ఆమెపై ఒత్తిడి తెచ్చాడు. ఆమెతో సన్నిహితంగా ఉన్న సమయంలో తీసిన ఫొటోలు, వీడియోలు బయటపెడతానని బెదిరించి రూ.లక్ష నగదు తీసుకున్నాడు. ఇటీవల మహిళపై దాడి చేయడంతో ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. ఈ క్రమంలోనే సునీల్‌రెడ్డికి ఇది వరకే వివాహమై ముగ్గురు పిల్లలున్నట్లు ఆమెకు తెలిసింది. తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేసిన అతడిపై చర్యలు తీసుకోవాలని ఆమె గురువారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మా రూటే సపరేటు

- ఎయిడెడ్ యాజమాన్యాల వింత వైఖరి
- ఆన్‌లైన్‌లో వద్దు.. ఆఫ్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహించాలంటూ హైకోర్టుకు..
- స్టే విధించిన న్యాయస్థానం
- పోస్టుల భర్తీకి పరీక్ష వాయిదా
- ఉసూరుమంటూ వెనుదిరిగిన అభ్యర్థులు

నెల్లూరు(టౌన్): ఉపాధ్యాయ పోస్టుల భర్తీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఎయిడెడ్ యాజమాన్యాలు సవాల్ విసురుతున్నాయి. తమ పాఠశాలల్లో పోస్టుల భర్తీకి సంబంధించిన పరీక్షను తమ ఇష్టానుసారంగా నిర్వహించాలని పట్టుబడుతున్నాయి. ఆన్‌లైన్‌లో కాకుండా ఆఫ్‌లైన్‌లోనే జరపాలంటూ హైకోర్టును జిల్లాలోని యాజమాన్యాలు ఆశ్రయించాయి. ఈ నేపథ్యంలో పోస్టుల భర్తీపై స్టే ఇచ్చింది.

1,600 మంది దరఖాస్తులు

నెల్లూరులోని కస్తూరిదేవి బాలికల హైస్కూల్లో ఏడు, గూడూరులోని పొట్టిశ్రీరాములు స్కూల్లో మూడు ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. దీనికి గానూ దాదాపు 1,600 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీటికి ఆన్‌లైన్‌లో పరీక్షను శుక్ర, శనివారాల్లో నిర్వహించనున్నామని ప్రకటించారు. దీంతో అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షకు వచ్చేందుకు సిద్ధమయ్యారు. దూరప్రాంతాల నుంచి కొందరు అభ్యర్థులు నెల్లూరుకు గురువారమే వచ్చారు. చివరికి వాయిదా వేశారని తెలుసుకుని ఉసూరుమంటూ వెనుదిరిగారు.

ససేమిరా..

కస్తూరిదేవి హైస్కూల్లో పోస్టులకు ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను జిల్లా విద్యాశాఖకు ఇచ్చేందుకు సదరు పాఠశాల యాజమాన్యం ససేమిరా అంది. ఆన్‌లైన్ పరీక్ష జరుగుతుందని ప్రకటించినా దరఖాస్తులను పంపలేదు. దీంతో ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు విద్యాశాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. దరఖాస్తు చేసినట్లు ఏమైనా ఆధారాలను తీసుకొస్తేనే హాల్‌టికెట్‌ను ఇస్తామని విద్యాశాఖ అధికారులు తేల్చిచెప్పారు. దీంతో వీటిని సమర్పించలేక కొందరు ఇక్కట్లు పడ్డారు.

అంతా అయోమయం

పోస్టుల భర్తీకి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆన్‌లైన్ పరీక్షపై ఆయా యాజమాన్యాలు అత్యవసర పిటిషన్ కింద హైకోర్టును ఆశ్రయించాయి. వివరాలు చెప్పేందుకు విద్యాశాఖ సమయం కోరడంతో హైకోర్టు స్టే ఇచ్చిందని తెలిసింది. వాదనలు ఎప్పటికి పూర్తయి.. తీర్పు ఎప్పుడొస్తుందో తెలియక అభ్యర్థులు ఆందోళనలో ఉన్నారు. పరీక్షను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించేలా ఎంత వరకైనా వెళ్లే యోచనలో ఎయిడెడ్ యాజమాన్యాలున్నాయని సమాచారం. పోస్టుల కోసం కొందరి నుంచి భారీ మొత్తంలో డబ్బులు తీసుకున్న వీరు ఆఫ్‌లైన్ పరీక్ష అయితేనే ఉద్యోగాలివ్వగలమనే భావనలో ఉన్నారని సమాచారం.